


# ఏడవకు ఏడవకు వెర్రినాగన్నా!

ఓలేటి శ్రీనివాసభాను

తల నిమురుతూ చీకట్లో కళ్ళు మూసుకు పడుకున్నాడు. వాడి ఊహా సరోవరాలు [illegible] పెట్టి ఏడుస్తూ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

ఏడవడం తప్ప మరేమీ సాధించలేని పసివాడు వాడు!

నట్టింట్లో కావేరమ్మ మంచానికి అంటుకుపోయి ఏడాది కావస్తూంది. ఎవరు ఎన్ని చెప్పినా ఆమెని పల్లెటూరి నాటు వైద్యంలోనే పరిపెడుతున్నాడు అవధాన్లు. ఏమో ఆరోగ్యంమీద శ్రద్ధ లేక కాదు: ఒక పూట తింటే మరోపూట గడవనివ్వని బండెడు సంసారం అతని మెడకు గుదిబండ. ఒకప్పుడైనా పూర్తిగా [illegible] పౌరోహిత్యం తరతరాల నాటి ఆటల ప్రవాహం.

పై ఊరిలో పెళ్ళిళ్ళు చేయించడానికి ఐదురోజుల క్రిందట వెళ్ళాడతను.

వీధిలో నాగన్న తమ్ముడు చెల్లెళ్ళతో కలిసి ఎదురింటి పిల్ల సందిట్లో స్తంభాలాట ఆడుకుంటున్నాడు. ఆడపోరి పాట అమ్మ మంచాన్ని ఊతగా చేసుకుని నట్టింట్లో తప్పటడుగులు వేస్తున్నాడు. పురిటికి పుట్టింటికి వచ్చిన భారతక్కయ్య వంటింట్లో లాంతరు చిమ్నీలు తుడుస్తోంది.

మంచం మీంచి నీరసంగా లేచింది కావేరమ్మ. ఆవిడకి నాగన్న వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి. సత్తువని కూడదీసుకుని మూల గదిలోనికి వెళ్ళింది. చీకట్లో వాడి ఏడుపు వినిపిస్తున్నా మనిషి కనిపించటం లేదు.

"నాగన్నా..." తడి ఆరిన గొంతుక తడబడతూ పిలిచింది. ఆ పిలుపు వాడి పేగుల్ని చుట్టుకొని వున్న బాధని బయటకు లాగింది. అమ్మను పట్టుకుని బావురుమన్నాడు వెర్రినాగన్న. మరి నిలబడలేకపోయింది కావేరమ్మ. అమ్మ ఒళ్ళో తల పెట్టుకుని ఏడుస్తున్నాడు నాగన్న. అక్కయ్య భారతి గది ద్వారం దగ్గర నిలబడింది.

"ఊరుకోరా నాయనా ఏడవకు! ఎంతకని ఏడుస్తావు? లే. నిన్ను పట్నంలో చేర్పిస్తాను. మేమెక్కడ ఎన్ని ఇబ్బందులైనా భరించి నిన్నక్కడ చదివిస్తాం. అవసరమైతే ఈ కొంప తెగనమ్మి ఇంటిల్లిపాదీ తాటాకుల కొంపలో వుంటాం. లే... లేచి ఈ పూటైనా ఎంగిలి పడు" కావేరమ్మ ఓదారుస్తోంది.

"అవున్రా తమ్ముడూ మీ బావ ఎవరినైనా పట్టుకుని కాలేజీలో సీటు సంపాదిస్తారు. మా వీధి కొట్టు ఖాళీ చేయిస్తాను నువ్వు చదువుకుందుకి పడుకుందుకి ఇమ్మగా వుంటుంది కూడాను." భారతి ధైర్యం చెబుతోంది.

వాళ్ళ ఓదార్పుతో తేరుకుని నాగన్న భోజనానికి లేచాడు. పౌరోహిత్యానికి వెళ్ళిన తండ్రి డబ్బుల్తో తిరిగి వస్తాడన్న ఆశ కూడా వుంది.

వారం రోజుల నాడు పరీక్షా ఫలితాలు వచ్చినప్పుడు సెకండ్ క్లాసులో తన నెంబరు చూసుకుని తెగ మురిసిపోయాడు నాగన్న! పదో క్లాసు వరకే వున్న ఆ పల్లెటూళ్లో కొడుకుని పదేళ్ళు చదివించ గలిగేడు

అవధాన్లు. ఆమధ్య ఫలితాలు రాక ముందు మరి పై చదువులకి పంపలేనని అక్కడా ఇక్కడా చూచాయగా చెబుతూనే వున్నాడతను.

అటుమొన్న ఫలితాలు తెలిసిన మర్నాడు—

ఎక్కడో సంపాదించిన ఇంటర్మీడియెట్ ఇంగ్లీషు పుస్తకానికి అట్ట వేసుకుని, కుదురుగా "ఎస్. నాగేశ్వరశర్మ, ఇంటర్మీడియెట్ (మొదటి సంవత్సరం)" అని నాగన్న రాసుకుంటున్నప్పుడు—

"ఇక నావల్ల కాదు. వాణ్ని పట్నంలో పెట్టి మరి నేను సాగలేను." అని నట్టింట్లో అవధాన్లు కచ్చితంగా చెప్పేశాడు.

అప్పుడు నాగన్నకి తను రాసుకున్న అక్షరాలు అందుకోలేని నక్షత్రాల్లా అనిపించేయి.

చిన్న రమణ మేస్టారి వీధి గడపలోకి చేరినప్పుడు ఎవరు ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకుంటే మంచిదో పిల్లలకు ఆయన వివరిస్తున్నారు. అందరూ సంబరపడుతుంటే నాగన్న మౌనంగా నిలబడ్డాడు.

"మరి చదవవ్వటా?" అవడిగేరు మాస్టారు.

"మా నాన్న చదివించ లేనంటున్నాడండి" ముఖం దించుకుని సమాధానం చెప్పేడు నాగన్న. ఆ మాటలు తనకే స్పష్టంగా వినిపించలేదు; ఆవేదన మధ్య

# ఏడవకు ఏడవకు వెర్రినాగన్నా

నలిగి అవి వంకర్లు తిరిగి పోయేయి.

అప్పుడు మాస్టారి ఓదార్పు తాత్కాలికమైన ఉపశమనం కలిగించినా వాడిలో పూర్తి ధైర్యం చేకూరలేదు. ఇవాళ ఇంట్లో అమ్మ ఓదార్పు అక్క శుష్కించినమద్దతు ఆశకు ఔషధాన్ని పోశాయి.

మర్నాడు మార్కుల జాబితాలొచ్చేయి. పది మార్కులతో నాగన్నకి ఫస్టుక్లాసు తప్పింది. అందరూ "అయ్యయ్యో" అన్నారు. నాగన్న ఎదురు చూస్తున్న అవధాన్లు సంతోషంతో ఇంటికి వచ్చేడు. వస్తూనే—

"రేపు మనిద్దరం విశాఖపట్నం వెళ్ళాలి" అన్నాడు కావేరమ్మతో, "ఎందుకు?" అని ఆవిడ అడగక ముందే విషయమంతా చెప్పి స్నానానికి వెళ్ళిపోయేడు.

చిన్న పొరుగూరి మునసబుగారి అమ్మాయి పెళ్ళికి అవధాన్లు పురోహితుడిగా వెళ్ళేడు. పెళ్ళికొడుకు చిన్నన్నగారు విశాఖపట్నంలో పెద్ద డాక్టరుట. అవధాన్లు ఆ సంగతి తెలుసుకుని తన భార్యని వేధిస్తున్న వ్యాధి గురించి విన్నవించేడు. వెంటనే ఆ డాక్టరుగారు తన అడ్రస్ ఇచ్చి పిలుచుకుని రమ్మన్నాడు. వైద్య పరీక్షలు ఉచితంగా చేసి వీలైతే కొన్ని మందులు ఇప్పించగలనని హామీ కూడా ఇచ్చేడు. అవసరమైతే మట్టుకు కొన్ని ఖరీదైన మందులు అతను కొనుక్కోవలసి వుంటుందని, డబ్బు జత పెట్టుకుని రమ్మని చెప్పేడు.

పెళ్ళిళ్ల సీజను పూర్తయింది. అవధాన్లు దగ్గర తిరికతో పాటు ప్రస్తుతం మూడు వందల రూపాయలు కూడా చిక్కాయి. ఎన్ని అవాంతరాలొచ్చినా కావేరమ్మని విశాఖపట్నం తీసుకెళ్ళాలని అతని నిశ్చయం!

రాత్రి భోజనాలు పూర్తయ్యాక అవధాన్లు బట్టలు సర్దుతున్నప్పుడు కావేరమ్మ తాపీగా వచ్చిచెప్పడానికి పూనుకుంది.

"......చూడండి అమ్మాయి పురిటికి వచ్చింది. ముందు ముందు బోలెడు ఖర్చులుంటాయి. అదీగాక నాగన్న విషయం ఆలోచించండి. ఇంత వరకూ చదివించి ఎటూకీ కాకుండా అర్ధాంతరంగా వదిలేస్తావా? రేపు వాణ్ని కాలేజీకి పంపాలంటే కనీసం మూడు వందలు కావాలి..." కావేరమ్మ మాటలు అవధాన్లుకి రుచించలేదు. చిర్రుమంటూ లేచేడు.

"పంపించే! నీ కొడుకుని కాలేజీకి పంపించు. ఆ చేత్తోనే మిగిలిన ఈ గుంట వెధవల్ని చేతికి సత్తుగిన్నె ఇచ్చి పంపించు: వీధుల్లో అడుక్కుని బతుకుతారు. కలిగుంటే వాడు నాకు బరువా? లేకనే కదా మరి నాతరం కాదు మొర్రో అని నెత్తి కొట్టుకుని అరుస్తున్నాను. అధమపక్షంలో బియ్యే చదివించాలంటే ఐదేళ్ళు భరించాలి. తీరా చదివించాక ఉద్యోగాల్లేవు పొమ్మంటే ఇటు నాలా పౌరోహిత్యం చెయ్యలేక అటు చెయ్యిచాచి అడుక్కోలేక ఉరి పోసుకు ఛస్తాడు."

ఏమ్మాటలండి అవి? రేపు డాక్టరు నేను బతకడం కష్టమని చెబితే తక్షాంతికైనా మందులు కొనడం మానేస్తారా? ఉద్యోగం వస్తుందో ఊడుతుందో అని సందేహాలు పెట్టుకుని చదివించకుండా వదిలేస్తారటండీ? ఈ బతుకు నుండి వాడు బయట పడాలి. అదృష్టం వరించి హాయిగా బతకాలి."

"అదృష్టం అఘోరించ బట్టే ఈ కొంపలో పుట్టేడు..." సర్దుకున్న బట్టల



పంచిని నేలకేసి కొట్టి వీధి అరుగు మీదకి పోయాడు అవధాన్లు.

సమస్య వారం రోజుల పాటు పెరుగుతోంది. ప్రయాణం వాయిదాలు పడుతోంది. నాగన్నలో ధైర్యం దిగజారిపోతూంది.

ఇంటల్లో ప్రశాంతత కరువైన పరిస్థితిలో భారతి బరువు పడింది. పరిస్థితి తారుమారై కడుపులో శిశువు అడ్డం తిరిగాడట. పరీక్షించిన పల్లెటూరి వైద్యుడు అర్జంటుగా పట్నం తీసుకెళ్లమన్నాడు

* * *

పట్నంలో భారతమ్మ గండం గడిచి గట్టెక్కింది. మగపిల్లడు పుట్టేడు. కూతుర్ని కోన్నాళ్ళ వరకు అక్కడుంచి నిమ్మళించిన తర్వాత ఇంటికి తీసుకొచ్చేడు అవధాన్లు.

ఈలోగా—

కాలేజీలో ఫీజ్మకట్టిన్న గడువు మించిపోయింది.

కావేరమ్మకి అస్వస్థత ఎక్కువైంది.

కూడబెట్టిన మూసు వందలు ఖర్చైపోగా కూతురు పురిటికి మరో మూడు వందలు అప్పు మిగిలింది అవధాన్లుకి!

! ఆరోజు సాయంత్రం చీకటి నట్టింట్లో నాగన్న ఆశలా మసక మసకగా వుంది. అమ్మ తల దగ్గర కూర్చుని నాగన్న వీటో చూసి చెబుతున్నాడు.

“కాలేజీలో చేరడానికి గడువు నాలుగు రోజులు పొడిగించారమ్మా...!” ప్రవాహంలో కొట్టుకుపోతూ మనిషి చేస్తున్న చివరి ప్రయత్నం అది.

“వచ్చేఏడు జాయిను అవుదువుగాని లేరా...” మునిగిపోతున్న మనిషిని రక్షించుకోలేని నిస్సహాయత కావేరమ్మది.

నాగన్న కళ్ళు వర్ష మేఘాలే అయ్యేయి.

“నాగన్నా...” గట్టిగా ఓ కేక వసారాలోంచి వచ్చింది. నాన్న ఎందుకు పిలుస్తున్నాడో నాగన్నకి అర్థమైంది.

“విన్నాళ్ళు రికామీగా తిరుగుతావురా? నాలుగు వేదమ్ముక్కలు నేర్చుకో— నాకు సాయంగా వుంటావు! ఇవాళ మంచిరోజు కూడాను పారాయణం మొదలు పెడదాం. శ్రద్ధగా వింటూ స్పష్టంగా అనాలి... అలా కూర్చో— ఆయతనం వేదా ఆయతనమాం భవతి...”

* * *

నాగన్నలో స్వరం చచ్చిపోయింది.

అవధాన్లు కంచు కంఠం నిశ్శబ్దం డొలుమీద లయతప్పి వాగుతోంది.


నట్టింట్లో కావేరమ్మ కన్నీరు చీకటి మంటల్లో దహించుకు పోతోంది.

పురిటి గదిలో పసివాడు పెంకు లెగిరిపోయేలా ఏడుస్తున్నాడు.

“ఏడవకు ఏడవకు వెర్రి నాగన్నా...”

పసివాణ్ణి ఒళ్ళోకి తీసుకుని పాడుతోంది భారతి.

ఆ పెంకుటింటి పెరటి వసారా మీద వెన్నెల పడకుండా మబ్బులు జాబిల్లికి అడ్డంగా నిలిచివున్నాయి.




## ప్రకృతి ప్రాభవం

తాను కల్పించిన సృష్టిలో ప్రతివస్తువు పైని భగవంతునికి సరిసమానమైన అభిమానమూ, దయాదాక్షిణ్యాలు ఉన్నవి. అయా ప్రాణుల జన్మాంతర కర్మలను బట్టి, వివిధ రూపాల్లో పుట్టడం, వాటికి సాధుత్వా సాధుత్వాలు కలగడం జరుగుతున్నది. ఒక ప్రాణి వల్ల మరొక ప్రాణికి హాని కలుగవలెననే సంకల్పం భగవంతుడికి లేదు. అందువల్లనే క్రూరమృగాలకు వన నివాసం, విషసర్పాలకు పుట్టలలో—జన సంచారానికి దూర ప్రాంతాలలో ఉనికి ఏర్పడింది. తమ ప్రాణానికి ఉపద్రవం కలుగుతుందనే భావం కలిగినప్పుడే క్రూర మృగాలు తిరగబడతాయి. అదీ, వాటి నివాసాలపై మనం దాడిచేసినప్పుడే! ఆ జంతువుల దృష్టిలో మానవులే క్రూరులు. అవి కంటబడితే, వాటిని చంపడానికే తరచు మానవుడు ప్రయత్నం చేస్తూ ఉంటాడు.

పంచభూతాల సృష్టి ప్రాణుల రక్షణ కోసమే! మహామునులు అడవుల్లో తపస్సు చేసుకుంటూ, నివసిస్తున్నప్పుడు వారి జీవనానికి వృక్షాలే ఆధారం. వారిని క్రూర మృగాలేవీ బాధించకుండా గ్రామీణ మృగాల వలె ఉండడానికి కారణం వారివల్ల తమకు ఏట్టిహాని కలగదనే ధైర్యమే!

సృష్టిలోని ప్రతివస్తువునూ మనం ఉన్నదానిని ఉన్నట్లుగా ఉపయోగిస్తే శరీరానికి ఏట్టి అనారోగ్యం కలగదనీ, ఏట్టి జబ్బులూ ప్రవేశించవనీ తత్త్వజ్ఞుల సిద్ధాంతం-ప్రకృతిచికిత్స అనేది దీనిపైనే ఆధారపడి ఉన్నది.

ఈ పద్ధతి ననుసరించే చన్నీటిస్నానమే ఉత్తమమైనదని చెప్తారు. చిన్నప్పుడు బడిలో “చన్నీటిస్నానంబు సత్తువనిచ్చు” అని చదివినట్లు జ్ఞాపకం. వేడినీళ్ళ చన్నీళ్ళ కంటే మేలైనవని తోచినప్పుడు భగవంతుడు వేడినీళ్ళనే సృజించి ఉండేవాడు. మనం కృత్రిమంగా వాటిని వేడిచేస్తున్నాము. చల్లనినీరు సూర్యుని కిరణ ప్రసారపు ప్రభావం పొంది వేడిఅవుతూ ఉన్నది. ఆ ప్రభావంపోయి, ఆ నీరు మామూలు స్థితికి రానడానికి కొన్నిగంటల కాలం పడుతుంది. తెల్లవారుజామున బ్రాహ్మ ముహూర్త సమయంలో ఆ నీరు మామూలు స్థితికి వస్తుందట! అందువల్ల తెల్లవారుజామున 4 గంటలకు పైగా—5 గంటలలోపల స్నానం చెయ్యడం ఉచితమనీ, అది ఎంతో ప్రశాంతినీ, ఆరోగ్యాన్నీ కలిగిస్తుందనీ చెప్తారు. ఈ సమయంలోని చన్నీటి స్నానమునే రెడ్డియప్పట్టిస్వామివారు తమ శిష్యులననుసరించవలసిన నిబంధనలలో మొదటి దానినిగా నియమించారు.

భగవన్నిర్మితమైన ప్రకృతి ప్రభావం ఆలోచించినకొద్దీ అద్భుతంగాకానవస్తుంది. దానిని మనం కృత్రిమంగా మార్చినపుడు— ఆ మార్పులవల్ల అనేకములైన అనర్థాలేర్పడుతాయి. ఈ రహస్యాన్ని తెలుసుకొని మానవులు ఉచిత రీతిని ప్రవర్తించడం మిక్కిలి అవసరం.